

సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

# రోడ్ల అభివృద్ధికి విజన్

- ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యం
- అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర రహదారులు : సమీక్షలో సీఎం కేసీఆర్
- యూరప్, అమెరికా రోడ్లపై ఆరా
- రహదారుల పరిస్థితులపై అధ్యయనం

**నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్**

ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా.. అంతర్జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో కూడిన రాష్ట్ర రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. రహదారులను నిర్మించడమే కాకుండా అవి ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు ఇతర దేశాల్లో అవలంబిస్తున్న ఆధునిక పద్ధతులపై అధ్యయనం చేయాలని సూచించారు. యూరప్, అమెరికా లాంటి దేశాల్లో రోడ్లు బాగున్నాయని, ఆ దేశాల్లో రోడ్లు ఎలా వేస్తున్నారో తెలుసుకోవాలన్నారు. ఆర్ అండ్ బీ రహదారులు, భవనాలపై మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, సునీల్ శర్మ, ఇఎన్‌సీ రవీందర్‌రావు, గణపతిరెడ్డిలతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రహదారుల ప్రస్తుత పరిస్థితిని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, రాబోవు పదేండ్ల కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రహదారులు ఎలా ఉన్నాయి? ఎలా ఉండాలి? భవిష్యత్తులో మెరుగైన రహదారుల వ్యవస్థ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలేంటి? జాతీయ రహదారులుగా మార్చాల్సిన రూట్లు ఏవి? కేంద్ర పథకాల ద్వారా నిర్మించాల్సిన రోడ్లు ఎక్కడున్నాయి.. ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకునేలా రహదారులను నిర్మించడం ఎలా? తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేసి భవిష్యత్తులో పనికొచ్చేలా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. మనిషి ప్రాణాలు అత్యంత విలువైనవి కాబట్టి ప్రమాద రహిత

..9లో

# రోడ్ల అభివృద్ధికి విజన్

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణానికి అనుగుణంగా రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు.

## రోడ్ల నాణ్యతపైనే రవాణ వ్యవస్థ

రాష్ట్రంలో రవాణ వ్యవస్థ మెరుగుదల రోడ్ల నాణ్యతపైనే ఆధారపడి ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి రహదారుల నిర్మాణం అవసరమో గుర్తించి దానికి అనుగుణంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి, మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కేంద్రం నుంచి 2500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను మంజూరు చేయించుకున్నామన్నారు. జాతీయ రహదారులతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలతో నిర్మించే రహదారులు, రాష్ట్ర పరిధిలోని రహదారులు, అన్నిటిని పరిగణనలోకి తీసుకుని దానికి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని తెలిపారు.

## హైదరాబాద్ చుట్టూ ఆర్ ఆర్ ఆర్ రోడ్డు

హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగు రోడ్డు అవతలి నుంచి 330 కిలోమీటర్ల మేర రీజనల్ రింగు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని సూచించారు. రెండేండ్లలో ఆర్ఆర్ఆర్ పనులను పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డీపీఆర్‌లు సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని, అవసరమైతే ఆ పనిని ఎక్కువ ప్యాకేజీలుగా విభజించి తక్కువ సమయంలో డీపీఆర్‌లు రూపొందించాలన్నారు. డీపీఆర్‌లు సిద్ధం కాగానే వెంటనే భూ సేకరణ జరిపి నిర్మాణం పనులను ప్రారంభించాలని తెలిపారు. రహదారుల నిర్మాణంలో ఎక్కువ కాలం మన్నేలా నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## కలచివేస్తున్న రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాల వల్ల నిత్యం అనేక మంది చనిపోవడం తనను కలిచివేస్తున్నదని సీఎం కేసీఆర్ అన్నారు. మలుపులు తగ్గించేందుకు రోడ్డును నేరుగా పునర్‌నిర్మించాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు పట్టణాలు, పెద్ద గ్రామాల మీదుగా వెళ్లే బైపాస్‌లు నిర్మించాలని చెప్పారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలన్నారు. జాతీయ రహదారులుగా బదిలీ అయిన రాష్ట్ర రహదారుల నిర్వహణ పనులు కూడా ఆర్ అండ్ బి శాఖ చేపట్టాలని, జాతీయ రహదారుల నిర్మాణం జరిగే వరకు వారే బాధ్యత తీసుకుని వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

నవతెలంగాణ Wed, 19 October 2016 epaper.navatelangana.com/c